

# ఓటు నమోదుకు మరో ఛాన్స్

ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల

**2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండే వారికి ఓటు హక్కు**

**లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా చర్యలు**

**ఈ నెల 20 నుంచి మార్పులు, చేర్పులకు అవకాశం**

**ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన**

**అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ఇటీవల కొత్త ఓటర్ల నమోదుతోపాటు మార్పులు, చేర్పులకు అవకాశమిచ్చింది. త్వరలోనే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల ప్రక్రియ నమోదుకు మరోసారి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు షెడ్యూల్ కూడా విడుదల చేసింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రకారం 18 ఏండ్లు నిండే యువతకు ఓటు హక్కు కల్పించడంతోపాటు మార్పులు, చేర్పులు చేపట్టనున్నది. ఈ నెల 20 నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రారంభించనున్నారు.**

–నేరేడుచర్ల, డిసెంబర్ 13

### 18 ఏండ్లు నిండిన వారికి అవకాశం

జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండే వారు కొత్తగా ఓటు నమోదుకు అర్హులని ఎన్నికల సంఘం పేర్కొంది. త్వరలోనే పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, పురపాలికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. దాంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏండ్లు నిండే వారు ఓటురుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఓటర్ల నమోదుతోపాటు బోగస్ ఓట్ల తొలగింపు, చిరునామా మార్పు చేసుకోవచ్చు. ఇలా రూపొందించిన ఓటర్ల జాబితా తుది ప్రక్రియను ఫిబ్రవరి 8 నాటికి పూర్తి చేయనున్నది. ఓటు నమోదు కోసం బీఎల్‌ఓలతోపాటు ఆన్‌లైన్‌లోనూ పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ క్రమంలో 18 ఏండ్లు నిండిన యువత పేర్లు సేకరించేందుకు బీఎల్‌ఓలు ఇంటింటికీ సందర్శిస్తారు. కొత్తగా ఫారం–6 పూర్తిచేసి అందజేస్తే బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అలాగే ఓటరు గుర్తింపు కార్డు చిరునామా, తప్పుల సవరణకూ ఇందులో అవకాశం ఉంటుంది. ఓటరు జాబితాలతోపాటు పోలింగ్ కేంద్రాలను క్రమబద్ధీకరించనున్నారు. ఓటరు జాబితా సరవణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో అధికారులు ఓటరు సవరణను పర్యవేక్షించనున్నారు. ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గతంలో చేపట్టిన విధంగానే బూత్‌స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

### శని, అదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

అర్హులైన యువత ఓటు నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలతోపాటు యువత కళాశాలల్లోనే దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించనున్నారు. ఇందుకుగాను షెడ్యూల్ వ్యవధిలో ఏదో ఒక శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. కొత్తవారి నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారు.

### షెడ్యూల్ ఇలా..

- జవవరి5 వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పులకు అవకాశం.
- జనవరి6న ఓటరు జాబితా ముసాయిదా ప్రకటన.
- జనవరి22 వరకు అభ్యంతరాల స్వీకరణ.
- జనవరి22 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఏదో ఒక శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ.
- ఫిబ్రవరి 2న అభ్యంతరాల పరిశీలన.
- ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన.

### ఏ ఫారం ఎందుకోసం?

- ఫారం–6 : కొత్తగా ఓటర్ల నమోదుకు ఫారం–6ను ఉపయోగించాలి. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు(లేకుంటే నివాస ధ్రువీకరణ పత్రం) జతపర్చాలి.
- ఫారం–6ఏ : ఎన్‌ఆర్‌ఐలు ఫారం–6ఏను ఉపయోగించాలి. ఇందుకు తాము నివాసముంటున్న దేశంలో సిటిజన్ షిప్ లేదని, అక్కడి అంబాసిడర్‌తో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.
- ఫారం–7 : ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫారం–7ను ఉపయోగించాలి. విచారించిన తర్వాత పేర్లు తొలగిస్తారు.
- ఫారం–8 : పేరు, పుట్టిన తేదీల్లో తప్పులను సవరించేందుకు ఫారం–8ను ఉపయోగించాలి. ఈ ఫారానికి సరి చేయాల్సిన పేరుకు సంబంధించిన డిక్లరేషన్, 10వ తరగతి మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదో ఒకటి జతపర్చాలి.
- ఫారం–8ఏ : చిరునామా మార్చేందుకు ఫారం–8ఏను ఉపయోగించాలి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన వారు పూర్వ చిరునామాతో ఉన్న గుర్తింపు కార్డు జిరాక్స్, ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తే సరిపోతుంది.

### సద్వినియోగం చేసుకోవాలి..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కొంత మంది పేర్లు గల్లంతు కావడం, జాబితాలో తప్పులు దొర్లడం, కుటుంబంలోనే ఒకరికి ఓ పోలింత్ బూత్‌లో, మరొకరికి మరో బూత్‌లో పేరు రావడంతో ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. కొంత మంది ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జాబితాలో పేర్లు లేని వారు, చిరునామా తప్పుగా ఉన్నవారు పోలింగ్ బూత్ మార్పుకోవాలన్నా సవరణకు అవకాశం ఉంది. ఈ నెల 20 నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# చలి పంజా

రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**వారం రోజుల్లో 21 నుంచి 17 డిగ్రీలకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు**

**అల్పపీడన ప్రభావంతో పెరిగిన చలిగాలులు**

**స్వెటర్లకు పెరుగుతున్న గిరాకీ**

**జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్య నిపుణులు**

రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి పంజా విసురుతున్నది. దాంతో జనం ఇండ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వారం రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21 నుంచి 17 డిగ్రీలకు పడిపోయాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 నుంచి 35 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. తెల్లవారుజామున 14 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. అల్పపీడన ప్రభావంతో చలిగాలుల తీవ్రత పెరిగింది. మంచు దుప్పటి కమ్మేస్తుంది. ప్రజలు చలిమంటలు వేస్తూ ఉపశమనం పొందుతున్నారు. చలిగాలుల నుంచి రక్షణకు దుప్పట్లు, స్వెటర్లు కొనుగోలు చేస్తుండటంతో వాటికి గిరాకీ పెరిగింది.

–తిరుమలగిరి, డిసెంబర్ 13

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చలి క్రమంగా పెరుగుతున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు కనిపించకపోయినప్పటికీ కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో క్షీణ దశ కనిపిస్తుండటంతో చలి వణికిస్తుంది. ప్రధానంగా రాత్రిపూట, తెల్లవారుజామున చలి తీవ్రత గణనీయంగా ఉంటుంది. శీతాకాలం ప్రారంభంతో చలి ప్రభావం కనిపిస్తున్నది. సాధారణంగా శీతాకాలం అక్టోబర్‌లో ప్రారంభమై జనవరితో ముగుస్తున్నది. చలి ప్రభావం మాత్రం డిసెంబర్‌లో ప్రారంభమై జనవరిలో తీవ్రంగా కనిపిస్తున్నది. పొరుగు రాష్ట్రాల్లో తుఫాన్ కారణంగా అక్కడి నుంచి చలి గాలులు వీయడం కూడా చలి పెరిగేందుకు ఒక కారణంగా కనిపిస్తుంది. గడిచిన వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21 నుంచి 17 డిగ్రీల మధ్యలో నమోదవుతుండగా తెల్లవారుజామున 14 నుంచి 16 డిగ్రీలకు పడిపోతున్నాయి.



అర్వపల్లిలో చలిమంట వేసుకుంటున్న ప్రజలు

### వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు..

| తేదీ | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| డిసెంబర్7 | 19.4 | 28.4 |
| డిసెంబర్8 | 20 | 26.8 |
| డిసెంబర్9 | 19 | 31.9 |
| డిసెంబర్10 | 19 | 34.8 |
| డిసెంబర్11 | 18 | 33.9 |
| డిసెంబర్12 | 17.8 | 32.7 |
| డిసెంబర్13 | 17.4 | 33.6 |

### స్వెటర్లతోనే పిల్లలు బడిబాట

చలి ప్రభావంతో బడి పిల్లలు స్వెటర్లతోనే బడిబాట పడుతున్నారు. వృద్ధులు అవి లేకుండా పొద్దున బయట కూర్చోలేకపోతున్న పరిస్థితి కనిపిస్తుంది. ఉదయాన్నే వ్యవసాయం, ఇతర పనులకు వెళ్లే వాళ్లు చలితో ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత పెరుగుతున్న కారణంగా జలుబు, దగ్గు, జ్వరం సోకే అవకాశం ఉండడంతో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.



నల్లగొండలో స్వెటర్లు ధరించి బైక్‌లపై వెళ్తున్న యువకులు



మఠంపల్లి మండల కేంద్రంలో కమ్మేసిన పొగమంచు

### జాగ్రత్తలు పాటించాలి



చలి కాలంలో ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. స్వెటర్లు ధరించాలి. అత్యవసరమైతే తప్పా తెల్లవారుజామున బయటకు వెళ్లకపోవడమే మంచిది. చిన్న పిల్లల పట్ల తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకంటే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఇక వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండడం అవసరం.

–వందన, పీహెచ్‌సీ వైద్యురాలు, తిరుమలగిరి

# సామాజిక సేవే పరమావధిగా..

## 7 ఏండ్లుగా విస్తృత సేవలందిస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్

**ఓ వైపు సర్కారు బడులు, అంగన్‌వాడీల బలోపేతం..**

**మరోవైపు పేద విద్యార్థులు, ఆడబిడ్డలకు ఆర్థిక చేయూత**

**పలువురి మన్ననలు పొందుతున్న సామాజిక వేత్త**

అందరికీ విద్యను చేరువ చేయాలనే గొప్ప లక్ష్యంతో ముందుకెళ్తున్న వ్యక్తి ఆయన. సర్కారు బడులను బలోపేతం చేస్తూ ఆయా పాఠశాలలకు అండగా నిలుస్తున్నాడు. ఎవరూ అడగకున్నా నేనున్నానంటూ చేయూత ఇస్తున్న మంచి మనిషి కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కావొద్దనే లక్ష్యంతో 2017లో 'కస్తూరి ఫౌండేషన్'ను ప్రారంభించి గత 7 ఏండ్లుగా విజయవంతంగా ముందుకెళ్తున్నారు. ఓ వైపు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతూ వాటి బలోపేతానికి కృషి చేస్తున్నాడు. మరోవైపు సామాజిక స్పృహతో బీద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెండ్లిళ్లకు పుస్తెమెట్టెలు అందచేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నాడు. అంతేకాకుండా ఎంతోమంది పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్స్ అందజేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు.

–రామగిరి, డిసెంబర్ 13



పీఏపల్లిలోని కేజీబీవీ విద్యార్థినులకు స్టడీ కిట్లు, జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్(ఫైల్)

**2017లో 'కస్తూరి ఫౌండేషన్'కు శ్రీకారం..**

కస్తూరి శ్రీచరణ్ 22 జూన్, 2017న 'కస్తూరి ఫౌండేషన్'కు శ్రీకారం చుట్టారు. డిసెంబర్ 14, 2017 నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో రూ.5 కోట్ల ఖర్చుతో సుమారు వందకు పైగా సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించారు. పేద విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సాయం చేస్తున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతియేటా మట్టి వినాయక విగ్రహాలతోపాటు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్నారు.

### ప్రైవేట్ ప్లే స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీల అభివృద్ధి..

తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యం చేసేందుకు అంగన్‌వాడీలను ప్రైవేట్ ప్లే స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.20 లక్షలతో పక్కా భవనాలు నిర్మించారు. మరో నాలుగు అంగన్‌వాడీలను రూ.8 లక్షలతో మెరుగుపర్చారు. ఆయా అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆట వస్తువులు, యూనిఫామ్ అందజేశారు.

### 60 మంది ఆడబిడ్డలకు కస్తూరి కల్యాణమస్తు..

పేదరికంలో ఉండి ఆడబిడ్డ పెండ్లి చేసే తల్లిదండ్రులకు పుస్తెమెట్టెలను సైతం ఉచితంగా అందించి అక్కున చేర్చుకుంటున్నారు. ఐదేండ్ల క్రితం 'కస్తూరి కల్యాణమస్తు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి తల్లిదండ్రులు లేని, నిరుపేద కుటుంబాలకు చెందిన 60 మంది ఆడబిడ్డల వివాహాలకు పుస్తెమెట్టలు అందజేశారు.

### బాలికా విద్యకు ప్రోత్సాహం..

బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ఇప్పటికే మునుగోడు, సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్, తిరుమలగిరిలోని కేజీబీవీల్లో రూ.20 లక్షలతో మౌలిక వసతులు కల్పించారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ సీట్లు సాధించి ఆర్థిక చేయూత కోసం ఎదురుచూస్తున్న ఐదుగురు గిరిజన విద్యార్థినులకు రూ.20 వేల చొప్పున అందజేశారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి వినూత్నంగా నోట్ పుస్తకాలిచ్చే ఏటీఎంను ప్రారంభించనున్నారు. తమకు నోట్ పుస్తకాలు కావాలని ఎవరైనా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణతో లెటర్‌ప్యాడ్‌తో వినతిపత్రం అందజేస్తే వారికి 24 గంటల్లో నోట్‌బుక్స్ పంపించే ప్రణాళికలు సిద్ధం చేశారు.

### ఫౌండేషన్ సేవలను విస్తరిస్తాం



ఏ విద్యార్థి చదువుకు దూరం కావొద్దనే ఉద్దేశంతోనే కస్తూరి ఫౌండేషన్‌ను స్థాపించాం. మొదట్లో విద్యారంగానికే పరిమితమైన మా ఫౌండేషన్ సేవలను ఇతర రంగాలకూ విస్తరించాం. ఇందులో భాగంగానే వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాం. ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లించేందుకు అంగన్‌వాడీలను తీర్చిదిద్దుతున్నాం. ముున్ముందు ఫౌండేషన్ సేవలను మరింత విస్తరిస్తాం.

–శ్రీచరణ్, వ్యవస్థాపకుడు, కస్తూరి ఫౌండేషన్

# జాతీయ స్థాయిలో ఎంజీయూ ఖ్యాతి చాటాలి

- యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి

రామగిరి, డిసెంబర్ 13 : వర్సిటీ ఐసీటీ అథ్లెటిక్స్‌లో విజయం సాధించిన విద్యార్థులు త్వరలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎంజీయూ ఖ్యాతిని చాటాలని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఐసీటీ అథ్లెటిక్స్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో పురుషుల ఓవరాల్ చాంపియన్ షిప్‌గా ఎస్‌ఎల్‌ఎన్ డిగ్రీ కళాశాల భువనగిరి విద్యార్థులు, మహిళా విభాగంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల భువనగిరి విద్యార్థులు నిలిచారు. వీరికి బహుమతులను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ అల్వాల రవి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.మురళి, డాక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ కళాశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి

# 16న బేస్‌బాల్, బీచ్ వాలీబాల్ ఉమ్మడి జిల్లాస్థాయి జట్ల ఎంపిక

నల్లగొండ రూరల్, డిసెంబర్ 13 : అండర్–19 ఉమ్మడి జిల్లాస్థాయి క్యారమ్స్, బేస్‌బాల్, బీచ్ వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపికను ఈ నెల 16న నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అండర్ –19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా క్రీడల్లో పాల్గొనేందుకు అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు తాము చదువుతున్న విద్యాసంస్థ నుంచి బోనఫైడ్‌తో పాటు పదో తరగతి మెమో తీసుకొని ఉదయం 10 గంటల వరకు స్టేడియానికి రావాలని సూచించారు. పూర్తి వివరాలకు కె. నర్సిరెడ్డి, సెల్ నంబర్ : 9440072854ను సంప్రదించాలని కోరారు.